క్లుప్తంగా

న్యాయవాద గుమాస్తాల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



న్యాయవాద గుమాస్తాల సంఘం నూతన కార్యవర్గం

నరసాపురం: నరసాపురం న్యాయవాద గుమాస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతాడ నిరీక్షణరావు, ఉపాధ్యక్షుడిగా మద్దాల బ్రహ్మయ్య, కార్యదర్శిగా లోకం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బద్దె జయరాజు, కోశాధికారిగా కోటిపల్లి వీరవెంకట సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు. న్యాయవాద గుమాస్తాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



సిద్ధాంతం పంచాయతీకి ఫాగింగ్ మిషన్ అందిస్తున్న దాతలు

పెనుగొండ: గ్రామ అభివృద్ధికి దాతల సహాయం ఎంతో ప్రశంసనీయమని సిద్ధాంతం గ్రామ సర్పంచ్ చింతపల్లి గని రాజు (చంటి) అన్నారు. సిద్ధాంతం గ్రామానికి చెందిన మండవల్లి హరిప్రసాద్ గ్రామపంచాయతీకి శనివారం రూ. 32 వేల రూపాయలు విలువచేసే దోమల నివారణ యంత్రం (ఫాగింగ్ మిషన్) అందించారు. హరి ప్రసాద్ గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో విలువైన వస్తువులు బహూకరిస్తున్నారని, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఉండి: చంద్రన్న స్వయం సోపానం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వచ్చే నెల 2,3 తేదీల్లో అనగా బుధ, గురువారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ రుణాలకు 20 రెవెన్యూ గ్రామాల్లో 1250 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

ప్రవీణ్ ఆకస్మిక మృతిపై విచారణ చేయాలి

వీరవాసరం: పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆకస్మిక మృతిపై ప్రత్యేక విచారణ చేపట్టాలని వైఎస్ఆర్సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు డిమాండ్ చేశారు. వీరవాసరంలో శనివారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల ప్రత్యేక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ అనుమానాస్పద మృతిని యాక్సిడెంట్ కేసుగా పరిగణించడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. అనంతరం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో వెంపల్ల నరసింహమూర్తి, తాడి రాజశేఖర్, గెడ్డం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు జలాభిషేకం



దుంపగడప రైల్వే గేటు వద్ద కనకదుర్గమ్మకు జలాభిషేకం చేసేందుకు క్యూ కట్టిన మహిళలు

ఆకివీడు: స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారి ఆరో వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు ఇంటి వద్ద నుండి పసుపు, వేపాకు నింపిన నీళ్లను బిందెలతో తీసుకువచ్చి జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజ నిర్వహించారు. 30న మహాచండీ, దుర్గా సహిత రుద్ర హోమం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేకంగా హోమగుండాలు సిద్ధం చేశారు. 31వ తేదీన అఖండ అన్నసమారాధన జరగనుందని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది.

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేద పండితులు హోమంనిర్వహించారు. 55 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు.

కోట సత్తెమ్మ ఆలయంలో

వీరవాసరం: స్థానిక కోట సత్తెమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వార్లకు చండీహోమాన్ని నిర్వహించారు. వీరవాసం గ్రామానికి చెందిన నూకల అప్పాజీ-అరుణకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు.

అమ్మకానికి మహాశయుడి ఆస్తులు



రాయిపేటలో అద్దేపల్లి సర్విశెట్టి స్థాపించిన బీజీబీఎస్ మహిళా కళాశాల



అమ్మకాలకు గురవుతున్న కళాశాల విలువైన స్థలం ఇదే



రాయిపేటలో సర్విశెట్టి విగ్రహం

- నరసాపురం బీజీబీఎస్ మహిళా కళాశాల కనుమరుగయ్యే ప్రమాదం
- పాలకవర్గం నిర్ణయంతో సర్విశెట్టి ఆశయాలకు తూట్లు

నరసాపురం: మహిళా అభ్యుదయంకోసం పరితపించిన వ్యక్తి, వితంతు పునర్వివాహాల కోసం తన జీవితాంతం పోరాడిన మహాశయుడు, మహిళా విద్యకోసం స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి పరితపించి పనిచేసి కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు గౌరవం పొందిన అద్దేపల్లి సర్విశెట్టి ఆశయాలను కొందరు ప్రబుద్ధులు అమ్మకానికి పెడుతున్నారు. మహిళలకు చదువు ద్వారానే వారి అభ్యుదయం సాధ్యమని సమాజానికి తెలియజేయడానికి 1934లో నరసాపురంలో మహిళా కళాశాలను స్థాపించి అనేక మంది మహిళలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన విద్యాలయం ఆస్తులను ముక్కలు, ముక్కలుగా విభజించి అమ్ముతున్నారు. దీనిపై ప్రజల్లో విపరీతంగా వ్యతిరేకత వస్తోంది. ఈ అమ్మకాలపై కొందరు నరసాపురం ఆర్డీవోకు ఫిర్యాదకు కూడా చేశారు. అయితే పాలకవర్గం మాత్రం ఏమీ పట్టించుకోకుండా ముందుకు వెళ్లడం విశేషం. నరసాపురం పట్టణానికి చెందిన అద్దేపల్లి సర్విశెట్టి స్వాతంత్ర్యానికి ముందు వితంతు పునర్వివాహాల కోసం పెద్ద ఉద్యమమే నడిపారు. ఈ ప్రాంతంలో భర్త చనిపోయిన మహిళల పరిస్థితి అత్యంత దీనంగా ఉండేది. అది మంచి పద్ధతి కాదని, వితంతులు మళ్లీ పెళ్లిచేసుకుని కొత్తజీవితాలను ఆరంభించవచ్చని ప్రజల్లో చైతన్యం తేవడమే కాకుండా అనేక వితంతు పునర్వివాహాలు చేశారు.

కళాశాల స్థాపన..

మహిళలకు చదువు చాలా అవసరమని భావించి సర్విశెట్టి నరసాపురం రాయిపేటలో 1934లో బీజీబీఎస్ (భాగవతం గుప్త బంగారు శేషావతారం) పేరుతో మహిళలకు ప్రత్యేకంగా కళాశాలను ప్రారంభించారు. తన సొంత ఇంటిని, కొంత స్థలాన్ని, అలాగే దాతల నుంచి సేకరించిన మరికొన్ని స్థలాలను కళాశాలకు సమకూర్చారు. రాష్ట్రంలోనే మహిళలకు ప్రత్యేకంగా ఓ కళాశాల ఉన్న అతి తక్కువ ప్రాంతాల్లో నరసాపురం ఒకటిగా గుర్తింపు తెచ్చుకుంది. కళాశాలను సర్విశెట్టి సమర్థవంతంగా నడిపారు. ఇటు వితంతు పునర్వివాహాలు, అటు మహిళా విద్యపై ఆయన చేసిన సేవలకు పద్మశ్రీ అవార్డు కూడా పొందారు. స్వాతంత్ర్యం అనంతరం ఎయిడెడ్ కళాశాలగా బీజీబీఎస్ కళాశాల రూపాంతరం చెందింది. 1981లో సర్విశెట్టి మరణానంతరం కొంతమంది కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్లుగా పనిచేశారు.

కళాశాల స్థలాల అమ్మకాలకు బరితెగింపు..

ఇటీవల కాలంలో కళాశాల స్థలాల అమ్మకాలకు పాలకవర్గం బరి తెగించడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సెక్రటీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, అధ్యక్షుడు నూలి వెంటకరమణమూర్తి ఆధ్వర్యంలో రాయిపేటలో 601, 490 సర్వే నంబర్లలోని కొంత విలువైన స్థలాన్ని ప్లాట్స్‌కు విక్రయించారు. దాదాపు రూ.8 కోట్ల విలువైన స్థలాన్ని తక్కువ ధరకు రూ 3 కోట్లకు విక్రయించారని 23వ వార్డు కౌన్సిలర్ భర్త కావలి నాని నరసాపురం ఆర్డీఓ దాసి రాజుకు ఫిర్యాదు చేశారు. ఉన్నత ఆశయాలతో సర్విశెట్టి ఇచ్చిన స్థలాన్ని, ఆయనకు దాతలు, ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను అవినీతితో నూలి శ్రీనివాస్ విక్రయిస్తున్నాడని నాని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాడు. అయితే తాము ఎయిడెడ్ నుంచి బయటకు వచ్చామని, కళాశాల నష్టాల్లో ఉందని, అప్పులు తీర్చడం కోసం కొంత స్థలాన్ని అమ్మామని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ చెపుతున్నారు. స్థలం అమ్మగా వచ్చిన సొమ్ము బ్యాంకులో ఉందని చెప్తున్నారు. ఏది ఏమైనా బీజీబీఎస్ మహిళా కళాశాల వ్యవహారాలు పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రభుత్వం ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేసి చక్కదిద్దాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ అధికారులు పాలకొల్లు మండలంలో శనివారం విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో చింతపర్రు గ్రామంలో ఓ వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం చేసిన తనిఖీల్లో కన్నయ్య అనే వ్యక్తి వద్ద ఏడు మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ షాపులు ఎవరు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సైలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ యువ పార్లమెంట్‌కు స్వర్ణాంధ్ర విద్యార్థులు



పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: జాతీయ యువజన పార్లమెంట్ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ అభినందించారు. ఈ మేరకు శనివారం నరసాపురం మండలం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులు బొడ్డు హిందూ, కోడూరి అఖిల లను అభినందించారు. ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులో నిర్వహించిన ఒక దేశం-ఒక ఎన్నిక అనే అంశంపై జిల్లా స్థాయి వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2025 సదస్సులో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు విస్సా మాణిక్యాలరావు, ఎంవీ కృష్ణమోహన్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కళాశాల కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, గోపిచంద్ తదితరులు అభినందించారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ళు కూల్చివేయడంతో నిరాశ్రయులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం బొండాడలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద పేద ప్రజలు ధర్నా చేపట్టారు. పెద్ద ఎత్తున బాధిత కుటుంబాలకు చెందిన మహిళలు ధర్నాలో పాల్గొన్నారు. రెవిన్యూ అధికారులు వినతి పత్రాన్ని అందజేశారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చాలి

భీమవరం అర్బన్: పేదల సొంతింటి కలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలో ఎస్సీపేటలో ఇళ్లు లేని వారికి 3 సెంట్లు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంధి యోహాన్, బీమా ఝాన్సీ, దొడ్డి స్వామి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం మార్చవద్దు

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరు శివారు చిల్లే వారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహ స్థల మార్పు చేయవద్దని గ్రామానికి చెందిన కొందరు ఆచంట తహసీల్దారుకు వినతి పత్రం సమర్పించారు. ఎనిమిదేళ్ల క్రితం దాతల సహకారంతో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. దాతలు సైతం ఆనాడు విగ్రహం మార్పు చేయకుండా ఉంటే సహకరిస్తానని తెలపడంతో అందరూ ఒకటై విగ్రహం పెట్టామన్నారు. ఇపుడు కొందరు విగ్రహాన్ని వేరేచోటుకు మార్చడానికి ప్రయత్నించి బద్ధలు కొడుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గోపరాజు మృతి



పెనుగొండ: కొడమంచిలి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గోపరాజు రాజా(47) శనివారం మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. రాజా మృతి పార్టీకి తీరని లోటని సర్పంచ్ సుంకర సీతారామ్ అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేసారన్నారు. రాజా మృతికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, ఎంపీటీసీలు చిలుకూరి నాగదుర్గా భవానీ నరేంద్ర, యల్లమెల్లి బేబీ రాజేష్ తదితరులు పోలిశెట్టి వనమరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ముఖదారమ్మ జాతర ప్రారంభం



ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ



ఆకర్షిస్తున్న ముఖదారమ్మ లైటింగ్



వెండి చీర, బంగారు కిరీటంతో ముఖదారమ్మ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖదారమ్మ వారి జాతర మహోత్సవాలు విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి ఏప్రిల్ 7 వరకూ తొమ్మిది రోజులు పాటు అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కుంపట్ల లక్ష్మణ గోవింద్ (చిన్నరాజా) శనివారం విలేకరులకు తెలిపారు. జిల్లాలోనే వెండిచీర, బంగారు కిరీటం కలిగిన రెండో అమ్మవారిగా ఈ ఆలయానికి గుర్తింపు ఉంది. ఈ తొమ్మిదిరోజులు అమ్మవారు వెండిచీర, బంగారు కిరీటం అలంకరణలో దర్శనమివ్వనున్నారు. నియోజకవర్గంలోనే మూడు రోజులు జాతర మహోత్సవాలు జరిగే ఏకైక ఆలయంగా అమ్మవారికి ఎంతో గుర్తింపు ఉంది. ఉగాది పర్వదినం నాడు అమ్మవారి పుట్టింటి వారైన పిన్ని కుటుంబ సభ్యులు, రెండవ రోజు ఆలయ కమిటీ వారిచే (స్టేజి ప్రోగ్రామ్‌లతో), మూడవ రోజు కాకుల కుటుంబ సభ్యులతో వివిధ సన్నాయి వాయిద్యాలతో, తీన్మార్ డప్పులతో, కోరగేదెలు, బుట్టబొమ్మలు, గరగల నృత్యాలతో అమ్మవారి ఊరేగింపు మూడు రోజుల పాటు జరగనుండడం విశేషం. శుక్రవారం అమ్మవారికి ఆలయ అధ్యక్షులు కుంపట్ల చిన్నరాజా దంపతులతో పట్టువస్త్రాలు సమర్పణ, రాత్రి 7 గంటలకు పంచహారతుల కార్యక్రమం నిర్వహిస్తారు. 5వ తేది ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పద్మశ్రీ గరికిపాటి నరసింహరావు కుమారుడు డాక్టర్ గురజాడ ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతర మహోత్సవాల సందర్భంగా మారుతి సెంటర్ నుంచి అమ్మవారి ఆలయం వరకూ విద్యుద్దీపాలంకరణలతో అలంకరణ చేశారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని 30 గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నిర్వహించారు. డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో చేసిన పనుల వివరాలను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో 1345 పనులు, పంచాయతీరాజ్ విభాగంలో 85 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఒక పని మొత్తం 1431 పనులు చేసినట్లు వివరించారు. ఈ పనులకు సంబంధించి వేతనాల రూపంలో కూలీలకు రూ.4 కోట్ల 19 లక్షల 57 వేల 624, మెటీరియల్ రూపంలో రూ.4 కోట్ల 38 లక్షల 79 వేల 538 వెరసి మొత్తం రూ.8 కోట్ల 58 లక్షల 37 వేల 162 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ పనులపై 30 గ్రామాల్లోనూ విచారణ చేసి గ్రామ సభలలో పనుల వివరాలు చదివినట్లు ఆయన చెప్పారు. ఈ మొత్తం పనుల్లో రూ.27,686 నిధులు దుర్వినియోగమయినట్లు గుర్తించి రికవరీ రాశారు. అలాగే రూ.7 వేలు ఫైన్ విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ డివిఓ పురుషోత్తం, అంబుడ్స్‌మెన్ ఆదినారాయణ, ఈఓఆర్డీ జేడీవి ప్రసాద్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పి ఎం గోవింద్, ఏపీఓ చక్రపాణి, టీఏ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంపుదలను విరమించుకోవాలి

భీమవరం: ఏప్రిల్ నుంచి పెంపుదల చేయాలనుకొనే ఆస్తిపన్ను ఆలోచనను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గతంలో అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను వసూలు చేయాలని విలువ ప్రకారం ఆస్తి పన్ను వసూలు చేస్తే సహించమని స్పష్టం చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వరలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి జియాద్దీన్

నరసాపురం: పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి ఆర్ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మెప్మా సిబ్బందికి పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో జడ్జి వరలక్ష్మి మాట్లాడారు. 18 సంవత్సరాల్లోపు ఆడపిల్లలను వివిధ రూపాలో లైంగికంగా వేధించిన వారు పోక్సో చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. ప్రస్తుత ఇంటర్నెట్ కాలంలో బాలికలు అనేక రకాలుగా వేధింపులకు లోనవుతున్నారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయడం, కోర్టును ఆశ్రయించడం ద్వారా న్యాయం జరుగుతుందని అన్నారు. పోక్సో చట్టంపై ముందు తల్లితండ్రులు కూడా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి, ప్యానల్ న్యాయవాది సీహెచ్ చిట్టిపద్మజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎన్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: బాలికలు అపరిచితులు, ఆకతాయిలపై అప్రమత్తంగా ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియాద్దీన్ అన్నారు. శనివారం ఎస్సీ బాలికల వసతి గృహంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జియాద్దీన్ మాట్లాడుతూ సమాజంలో ఎవరి నుంచైనా లైంగిక వేధింపులు ఎదురైతే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసు అధికారులకు, చైల్డ్ కేర్ వారికి గాని ఎవరికైనా తెలియపర్చాలని స్పష్టం చేశారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన చేసుకోవాలన్నారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైతే మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పాలకొల్లు వారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పి.పూర్ణ రవిచంద్ర, హాస్టల్ వార్డెన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో వైన్ షాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన కండెల్లి అశోక్(31) తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే మార్టేరు గ్రామానికి చెందిన అశోక్ పని నిమిత్తం బైక్ పై భీమవరం వెళ్తుండగా వేంద్ర వైన్ షాప్ దగ్గరలో ఎదురుగా వస్తున్న వేరొక మోటార్ సైకిలిస్ట్ బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో అశోక్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి గాయపడిన క్షతగాత్రుడిని ఆటోలో భీమవరం లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు: అక్రమంగా తరలిస్తున్న ఏడు మద్యం సీసాల్ని ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన సమాచారం మేరకు ఎస్‌హెచ్ఓ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది ఆకస్మిక దాడి చేసి మిద్దే వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కాలర్‌షిప్ చెక్కుల అందజేత

భీమవరం: ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని ఎమ్మెల్యే, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో శనివారం మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 82 మంది విద్యార్థులకు రూ 7 లక్షల స్కాలర్‌షిప్ చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కోళ్ళ నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, పత్తి హరివర్ధన్ పాల్గొన్నారు.

కూటమిలో నామినేటెడ్ చిచ్చు

- నివురుగప్పిన నిప్పులా ఉన్న తెలుగు తమ్ముళ్లు
- ఎక్కువైన పైరవీలు.. తలలు పట్టుకుంటున్న నాయకులు
- జనసేన, బీజేపీ నాయకులపై శీతకన్ను

పాలకొల్లు సెంట్రల్: కూటమి పార్టీలో నామినేటెడ్ చిచ్చు ఎక్కువైంది. ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవితో పాటు ఏఎంసీ చైర్మన్ పదవుల కోసం మంత్రి చుట్టూ తిరుగుతున్నారు. మార్కెటింగ్ యార్డు పదవి కోసం ముగ్గురు ఆశావహులు రేసులో ఉన్నారు. ముగ్గురూ నియోజకవర్గంలో ఏ మండలానికి ఆ మండలంలో, పట్టణంలో మంచి పట్టున్న నేతలే. టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెచ్చెట్టి బాబు (ఆచంట ఎమ్మెల్యే పితాని బావమరిది), పాలకొల్లు మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కరరావు, యలమంచిలి మండల నాయకుడు మామిడిశెట్టి పెద్దిరాజు ఏఎంసీ చైర్మన్ పదవి కోసం రేసులో ఉన్నారు. ఈ ముగ్గురిలో ఎవరికి పదవి ఇచ్చినా మిగిలిన ఇద్దరూ అలక పాన్పు ఎక్కే అవకాశం ఉండడంతో నాయకుల అభిప్రాయ సేకరణ పేరుతో కొత్త డ్రామా మొదలు పెట్టారని తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుకుంటున్నారు. కోడి విజయభాస్కరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు ఇద్దరిలో ఎవరికో ఒకరికి ఏఎంసీ ఇచ్చి మిగిలిన వారిని సముదాయించే చర్యలు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క పెచ్చెట్టి బాబును మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మళ్లీ ఇక్కడ పోటీ ఉండే అవకాశం ఉంది. ఒకవేళ మునిసిపల్ చైర్మన్ పదవి బాబుకు కేటాయించాలంటే తూర్పుకాపు సామాజికవర్గం నుంచి కర్నేని గౌరునాయుడు భార్య మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ రోజారమణి పోటీకి వచ్చే అవకాశం ఉంటుందని తమ్ముళ్లు అనుకుంటున్నారు. ఏది ఏమైనా మంత్రికి నియోజకవర్గంలో పదవుల పంపిణీ పెద్ద తలపోటుగా ఉండనుంది.

జనసేనకు హుళక్కే..

టీడీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ పదవి కోసం పైరవీలు చేస్తుంటే జనసేన నేతలు ఏఎంసీ వైస్ చైర్మన్ పదవి తమకు కేటాయించాలని అడిగినట్టు సమాచారం. పదవుల కేటాయింపు తనకే తలపోటుగా ఉందని, మీకేమీ ఇచ్చేది లేదని, తరువాత గానీ, మిగిలిన వాటిలో గాని చూద్దామని మంత్రి జనసేన నేతలకు తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. పట్టణంలో ఒక్క కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవి మాత్రమే జనసేనకు దక్కే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఏ పదవైనా ఇస్తే తీసుకుందాం. లేదంటే మునిసిపల్ వైస్ చైర్మన్ పదవిని గట్టిగా పట్టుపడదామనే ఉద్దేశంలో జనసేన నేతలు ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీ నాయకులకైతే ఏ పదవిస్తే అదే ప్రసాదంగా భావించే పరిస్థితిలో ఉన్నారు.